# సురేష్

## తెలుగు ఎన్ ఆర్ ఐ ఆఫ్ ద ఇయర్

బ్యాంకునుంచి లోన్ తీసుకుని పైచదువులు చదవకపోయి ఉంటే... తాను విదేశంలో ఉన్నతస్థాయి ఉద్యోగం పొందగలిగేవాడిని కాదన్న స్పృహ ఆయనను అనుక్షణం నడిపిస్తూ ఉంటుంది. తనలాంటి వారికి సాయపడాలనే ఆలోచనకు అదే పునాది. తన సమయంలోనూ సంపాదనలోనూ కొంత భాగం సేవా కార్యక్రమాలకు వెచ్చించడం ఈ ప్రవాస భారతీయుడికి అత్యంత ఇష్టమైన పని.

మాతృదేశంలో రైతులు, మహిళలు, చేనేత కార్మికులు, గ్రామీణ విద్యార్థులు ఎదుర్కొంటున్న ఎన్నో సమస్యలపై స్పందించడం తన బాధ్యతగా భావిస్తారు సురేష్. తనతోపాటు మిత్రులనుంచీ నిధులను సేకరించి కష్టంలో ఉన్నవారికి ఆర్థికంగా తోడ్పాటునందిస్తారు. ఇందుకోసం ఇండివిడ్యువల్స్ 4 ఫార్మర్స్ (ఐ4ఫార్మర్స్) అనే స్వచ్ఛంద సేవా సంస్థను నెలకొల్పారు. దీని ద్వారా తెలుగు రాష్ట్రాల్లో అప్పులపాలై ఆత్మహత్యలు చేసుకున్న రైతుల కుటుంబాల్లో ఉన్న మహిళా రైతులకు తోడ్పాటునందిస్తున్నారు.

సంగారెడ్డి జిల్లాలో 178 మంది మహిళా రైతులు నేలమ్మ మహిళా రైతుల పరస్పర సహాయ సహకార సంఘం ఏర్పాటు చేసుకున్నారు. వీరందరికీ మనిషికి రూ. 5 వేల చొప్పున వడ్డీ లేని రుణాలను అందిస్తున్న ఐ4ఫార్మర్స్, రైతులను సేంద్రియ వ్యవసాయం వైపు మళ్లించేందుకు స్థానిక స్వచ్ఛంద సంస్థలతో కలిసి పనిచేస్తుంది.
విదర్భ ప్రాంతంలోనూ ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబాలకు ఐ4ఫార్మర్స్ సంస

అనేక ఏళ్లుగా ఆర్థిక సహాయాన్ని అందిస్తున్నది.

రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై నేరుగా రైతుల ద్వారానే నెటిజన్లకు అవగాహన కల్పించేందుకు వారం వారం కిసాన్ కి బాత్ లేదా రైతు మాట ఇంటర్నెట్ రేడియో కార్యక్రమాన్ని సురేశ్ నిర్వహిస్తున్నారు.

వ్యవసాయోత్పత్తులను నేరుగా రైతుల నుంచే కొనుగోలు చేస్తే.. మనం చెల్లించే ప్రతి రూపాయి రైతుకే చెందుతుందని సురేశ్ బలంగా నమ్ముతారు. తమ కుటుంబంతోపాటు మరో 50 కుటుంబాలు ఇప్పుడు ఉత్పత్తులను నేరుగా రైతుల నుంచే కొనుగోలు చేస్తున్నారు. సురేశ్ సతీమణి శిరీష, సురేశ్ తల్లిదండ్రులు రూ. 60 వేల పోచంపల్లి చీరలు అమ్మటం ద్వారా చేనేత కార్మికులకు తోడ్పాటునందించారు.

నలుగురి మేలు కోరి సేవామార్గాన్ని ఎంచుకోవడమే కాకుండా, మరికొంతమందిని అదే దారిలో నడిపిస్తున్న ఐ4ఫార్మర్స్ వ్యవస్థాపకులు సురేష్‌ను సాక్షి ఎక్స్‌లెన్స్ అవార్డ్స్ 2017... తెలుగు ఎన్ఆర్ఐ ఆఫ్ ద ఇయర్‌గా సత్కరిస్తోంది సాక్షి.